

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

శావల్యాపురం: మండలంలోని పొట్లూరు గ్రామ పరిధిలో ఏజీసీ కెనాల్ వద్ద వేంచేసియున్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



గోపయ్య, లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల గ్రామంలో గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



ఘంటసాలకు ఘన నివాళి

నగరంపాలెం: అమర గాయకులు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం నాజ్ కూడలిలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సులో మంటలు



అమరావతి: మండల పరిధిలోని తురగావారి పాలెం గ్రామం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు నుంచి క్రోసూరు వెళుతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు మండల పరిధిలోని తురగావారి పాలెం సమీపానికి రాగానే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగి, పొగ కమ్ముకుంది. ఈసమయంలో బస్సులో ఉన్న పదిమంది ప్రయాణికులు, డ్రైవర్, కండక్టర్‌లు బస్సు నుంచి కిందకు దిగిపోయారు. ప్రమాదాన్ని గమనించిన తురగావారిపాలెం గ్రామస్తులు అందుబాటులో ఉన్న నీళ్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తుండగా క్రోసూరు నుంచి వచ్చిన ఫైరింజన్ సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.

నేడు నరసరావుపేట రానున్న జస్టిస్ జాస్తి చలమేశ్వర్

నరసరావుపేటటౌన్: సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ బుధవారం నరసరావుపేట రానున్నారు. నరసరావుపేట న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ కౌన్సిల్ జి.ఎల్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించనున్న గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఆయనతో పాటు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వి.ఆర్.కె.కృపాసాగర్ పాల్గొననున్నారు.

ఘనంగా తాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం



నగరం: మండలంలోని ధూళిపూడి గ్రామంలో వేంసేసి ఉన్న శ్రీతాళ్లమ్మ, వీరమ్మ, పేరంటాళ్ల, చింతయ్యస్వామి దేవస్థాన తిరునాళ్ల మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకుని శ్రీ తాళ్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ధూళిపూడి ప్రాంత పరిధిలోని 18గ్రామాల ప్రజలు ఆలయానికి చేరుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న చెప్పారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ భార్గవ్ పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

స్థల వివాదంలో వ్యక్తి మృతి



పెదకూరపాడు: స్థలం వివాదంలో ఇరు కుటుంబాల మధ్య చెలరేగిన వివాదం వ్యక్తి మరణానికి దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం..పెదకూరపాడులోని మిట్ట ప్రాంతంలోని పోలీసుస్టేషన్ సమీపంలో కర్రి రామ్మోహన్‌రావు (50)కు, అతని ఇంటి పక్కన ఉండే బత్తుల రత్తయ్య, అప్పారావు కుటుంబాల మధ్య గత కొంతకాలంగా స్థలం వివాదం నెలకొంది. కర్రి రామ్మోహన్‌రావు పశువులను కాసుకుంటూ జీవనం సాగించేవాడు. పశువుల వ్యర్థాలను పక్కన ఉన్న స్థలంలో వేస్తుండేవాడు. ఇరు పక్కల నివాసం ఉండే బత్తుల రత్తయ్య, అప్పారావులు ఈ స్థలం విషయమై తరుచుగా రామ్మోన్‌రావుతో గొడవలు పడుతుండేవారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగడంతో బత్తుల రత్తయ్య, అప్పారావులు ఒకసారిగా కర్రి రామ్మోహన్‌రావుపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు సీఐ పత్తిపాటి సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 542.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఆలపాటికి ఎదురుగాలి

సొంత పార్టీ క్యాడర్ నుంచే సహాయ నిరాకరణ

- పొన్నూరులో సహకరించని ఎమ్మెల్యే నరేంద్ర
- దేవినేని ఉమాను రంగంలోకి దింపిన అధిష్టానం
- పెదకాకాని, పొన్నూరుల్లో సమావేశాలు
- హాజరు కాకుండా వెళ్లిపోయిన నరేంద్ర
- తెనాలిలో మంత్రి నుంచీ సహకారం శూన్యం
- గుంటూరు నగరంలోనూ ఇదే పరిస్థితి
- మరో అధికార కేంద్రంగా మారతారనే వ్యతిరేకత

నాదెండ్ల నుంచి సహకారం కరవు

ఆలపాటి రాజా సొంత నియోజకవర్గమైన తెనాలిలో కూడా మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి సహకారం లేదు.

- ఏదో మొక్కుబడిగా కార్యక్రమాల్లో పాల్గొంటున్న మనోహర్.. పూర్తి స్థాయిలో పని చేయడం లేదని తెలుగుదేశం నేతలు చెబుతున్నారు.
- ఇటీవల నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఒక స్కూల్‌లో ఉపాధ్యాయులు ఎక్కువ మంది సెలవులో ఉండటంతో వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి మనోహర్ వెంటనే డీఈవోను ఆదేశించారు. ఈ విషయంలో రాజా జోక్యం చేసుకుని ఏపీటీఎఫ్‌తో స్టేట్‌మెంట్ ఇప్పించి, డీఈవోపై ఒత్తిడి పెంచి చర్యలు తీసుకునే ఆలోచన విరమించేలా చేశారు. దీనిపై మంత్రి మనోహర్‌కు, ఆలపాటి రాజాకు మధ్య అంతరం పెరిగిందని చెబుతున్నారు.
- సొంత జిల్లాలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే కృష్ణాజిల్లాలో నేతలు ఎంతమేరకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.



చేబ్రోలులో తెలుగుదేశం కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి దేవినేని

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు జిల్లాలోని పలుచోట్ల సహాయనిరాకరణ తప్పడం లేదు. ఎమ్మెల్యేలతోపాటు క్యాడర్ నుంచి కూడా మద్దతు రాకపోవడంతో విజయావకాశాలపై తర్జనభర్జన పడుతున్నారు. ముఖ్యంగా పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర పూర్తిగా దూరంగా ఉండటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దీంతో నష్టనివారణకు కృష్ణా జిల్లాకు చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా నేత మన్నవ సుబ్బారావులను అధిష్టానం రంగంలోకి దింపింది. ఆయన మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి నాయకులను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని నరేంద్ర వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బయటవాళ్లు వచ్చి తమ వద్ద సమావేశాలు పెట్టేదేంటని, తమ ఎమ్మెల్యేని కాదని తాము ఏం చేయలేమని స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది.

- ఈ నెల 4న పొన్నూరు మండల సమావేశం జరపగా, 10వ తేదీన పెదకాకానిలో నిర్వహించారు. ఈ రెండు రోజులు నరేంద్ర జిల్లాలో అందుబాటులో లేరు.
- మంగళవారం చేబ్రోలు మండల సమావేశాన్ని దేవినేని ఉమా నిర్వహించారు. నరేంద్ర నియోజకవర్గంలోనే ఉండి కూడా హాజరు కాలేదు. దీంతో దేవినేని ఉమా, ఎమ్మెల్యే నరేంద్రను కలిసి చర్చించారు. తమ మధ్య ఉన్న విభేదాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సమక్షంలోనే తేల్చుకుంటానని నరేంద్ర స్పష్టం చేసినట్లు తెలిసింది.

సంగం డెయిరీ విషయంలోనూ, వ్యక్తిగతంగానూ ఆలపాటి రాజా తనను చాలా ఇబ్బంది పెట్టారని చెబుతూ ఆయనకు ఏ విధంగానూ సహకరించే అవకాశమే లేదని నరేంద్ర తేల్చిచెప్పినట్లు సమాచారం.

- దీంతో దేవినేని ఉమా మళ్లీ సమావేశానికి నరేంద్రతో వస్తానని, అంతవరకూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడాలని నాయకులను కోరినట్లు తెలిసింది.

మిగిలిన ఎమ్మెల్యేలదీ అదే దారి

- గుంటూరు తూర్పు, పశ్చిమ, పత్తిపాడు ఎమ్మెల్యేలు పైకి సహకరిస్తున్నట్లు కనపడుతున్నా లోపల మాత్రం రాజా గెలుపును ఇష్టపడటం లేదు.
- ఆలపాటి రాజా గెలిస్తే గుంటూరు నగరంలో మరో అధికార కేంద్రంగా మారతారన్న భయం వారిని వెంటాడుతోంది. ఇప్పటికే తన సామాజిక వర్గం నేతలందరినీ పిలిపించుకుని తాను గెలిచాక ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని చెప్పి ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. వీరు స్థానిక ఎమ్మెల్యేలను పట్టించుకోవడం లేదు.
- దీంతో రాజా వ్యవహార శైలి పట్ల వారు ఆగ్రహంతో ఉన్నారు. మరోవైపు మేయర్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంతో కార్పొరేటర్లు కూడా రెండు వర్గాలుగా చీలిపోయారు. వీరిలో ఎంత మంది సహకరిస్తారన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు



నరసరావుపేట మున్సిపల్ హైస్కూలులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- ఎస్పీతో కలిసి జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన

నరసరావుపేట/సత్తెనపల్లి/ముప్పాళ్ల: ఈనెల 27న జిల్లాలో నిర్వహించనున్న ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లా ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. తొలుత స్థానిక మున్సిపల్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం సత్తెనపల్లిలోని బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం, ముప్పాళ్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. తదుపరి రాజుపాలెంలో ఉన్న పోలింగ్ కేంద్రం, నకరికల్లులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పట్టభద్రుల ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ర్యాంపుల ఏర్పాటు అవసరమైన నిరంతర విద్యుత్ అందించేలా మంచినీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. క్యూలైన్లను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ సమయంలో ఓటర్లు ఎండ తీవ్రతకు గురికాకుండా ఉండేవిధంగా టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. నరసరావుపేట, సత్తెనపల్లి ఆర్డీఓలు కె.మధులత, రమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో పారిశ్రామిక వృద్ధి సాధించండి

నరసరావుపేట: జిల్లాలో రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని అనుసరించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తగిన ప్రోత్సాహం, ఆర్థిక సాయం అందజేసి పారిశ్రామిక వృద్ధిని సాధించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల అధికారి పి.సుధాకర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి విధానం 2015-20, 2020-23, 2023-27, ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకం, సూక్ష్మ చిన్న సంస్థలు, క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, జిల్లా పారిశ్రామిక పార్కుల్లో ప్లాట్ల కేటాయింపులు తదితర పథకాల కింద ప్రోత్సాహకాలు, ఆర్థికసాయం అందజేయాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు పెట్టుబడి రాయితీ, సులభతర వ్యాపారం లాంటి పలు అజెండాలపై చర్చించారు. ఈ మాసంలో సింగిల్ డెస్క్, పోర్టల్ అనుమతుల పురోగతిలో 185 దరఖాస్తులకుగాను 172 ఆమోదించటం జరిగిందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ఇప్పటివరకు 4028 మందికి శిక్షణ ఇచ్చామని, 3357 దరఖాస్తులను బ్యాంకులకు పంపించటం జరిగిందన్నారు. వాటిలో 414 మంజురుకాగా, 335 యూనిట్లకు రుణాలు విడుదల చేశారన్నారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగం



శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

- కనుల పండువగా శ్రీ గోపయ్య, తిరుపతమ్మ కల్యాణ వేడుక
- ఘనంగా ప్రారంభమైన పెద్ద తిరునాళ్ల

పెనుగంచిప్రోలు: రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధ పత్ర, పుష్పాలతో సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణ వేడుక వైభవంగా సాగింది. ఈ మహోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించారు. మంగళవారం రాత్రి 9.32 గంటలకు ఆశ్లేష నక్షత్రయుక్త కన్యాలగ్న పుష్కరాంశంనందు భక్తుల జయజయ ధ్వానాల నడుమ కల్యాణోత్సవం జరిగింది. విద్యుత్ దీప కాంతులతో శోభిల్లుతున్న ఆలయ ప్రాంగణం బయట ఖమ్మంనకు చెందిన కళాకారులు ప్రత్యేకంగా నిర్మించిన మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ సాక్షిగా అమ్మవారు, స్వామివార్ల కల్యాణ ఘట్టం కమనీయంగా సాగింది. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ పీటలపై శ్రీతిరుపతమ్మ అమ్మవారి వంశీకుల తరఫున కొల్లా వెంకట చంద్రమౌళి దంపతులు, గోపయ్య స్వామి వంశీకుల తరఫున కాకాని వెంకట శ్రీనివాసరావు దంపతులు, ఆలయ ఈఓ బి.హెచ్.వి.ఎస్.ఎన్.కిషోర్‌కుమార్, నందిగామ ఏసీపీ తిలక్ దంపతులు కల్యాణ కూర్చొని వేడుక జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. తొలుత ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త భారతీయం సత్యవాణి ప్రవచనం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి కల్యాణ వేడుక ముగిసే వరకూ నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దంపతులు, ఈఈ ఎల్.రమ, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈలు రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్ద తిరునాళ్ల

శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం 6.08 గంటలకు ఆలయ ఈఓ బి.హెచ్.వి.ఎస్.ఎన్.కిషోర్‌కుమార్, ఈఈ ఎల్.రమ ఆధ్వర్యంలో అఖండజ్యోతి స్థాపన, ప్రత్యేక పూజల అనంతరం దీక్షా స్వాముల తిరుముడి సమర్పణతో ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో తిరుముడి కట్టుకున్న స్వాములు అమ్మ భజనలతో, శరణు ఘోషతో అమ్మవారిని దర్శించుకొని తిరుముడి సమర్పించి హోమ గుండంలో తిరుముడిలోని ముద్దర టెంకాయలోని నెయ్యిని సమర్పించారు. దీక్షాస్వాములు వేలాదిగా తరలి రావటంతో ఆలయ పరిసరాలతో పాటు గ్రామం అంతా ఎరుపెక్కింది.



విద్యుత్ దీపాల వెలుగులో కాంతులీనుతున్న తిరుపతమ్మ ఆలయం, పరిసరాలు

30 మంది పట్టభద్రుల నామినేషన్లు అంగీకారం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా , గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి , జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, డీఆర్‌ఓ షేక్ ఖాజావలి మంగళవారం జిల్లా కలెక్టరేట్లో పరిశీలించారు. 30 మంది నామినేషన్లను అంగీకరించారు. పదిమంది నామినేషన్లను తిరస్కరించారు. నామినేషన్‌లు అంగీకరించిన వారిలో తెలుగుదేశం పార్టీ నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్, నేషనల్ నవ క్రాంతి పార్టీ నుంచి కనకం శ్రీనివాసరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అన్నవరపు ఆనంద్ కిషోర్, అరిగెల శివరాం ప్రసాద్, అహ్మద్ షేక్, ఉమర్ బాషా షేక్, ఏమిల్ల వినయ్ కుమార్ తంబి, కందుల వెంకటరావు, గుడిస రాంబాబు, గుంతకల్లు వెంకటేశ్వర్లు, గుమ్మ శ్రీనివాసరావు, గౌతుకట్ల అంకమ్మరావు, గంగోలు శామ్యూల్, గంటా మమత, జూపూడి శ్యాంప్రసాద్, డేగల సైదా రాజు, ధారా విక్రం, దీపక్ పులుగు, దూకి పట్టి రాధాకృష్ణమూర్తి, బొట్ల శివ సత్యనారాయణ, మూరకొండ చంద్రశేఖర్, మేరిగా మోహన్ రావు, మంత్రి బాలకృష్ణ, యార్లగడ్డ శోభారాణి, రామకోటయ్య మద్దుముల, లగడపాటి వేణు గోపాల్, కేఎస్ లక్ష్మణరావు, శారద తిరువీధుల, సత్యబాల సుందర రామశర్మ చుండూరు ఉన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మంగళవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

సృజనాత్మకత దివ్యం



- బొమ్మల ప్రపంచంలో ప్రతిభ చూపుతున్న దివ్య
- చిత్రలేఖనం ద్వారా భావాలు పంచుకుంటున్న యువ ఇంజినీర్
- అందమైన బొమ్మలు గీయడమే హాబీ
- ప్రముఖుల ప్రశంసలు


యడ్లపాడు: యడ్లపాడు గ్రామానికి చెందిన దివ్య సాయిశ్రీ, 23 ఏళ్లకే సాఫ్ట్‌వేర్‌లో పట్టు సాధించింది. మరోవైపు చిత్రలేఖనంలో తొలి అడుగులు వేస్తున్న యువ కళాకారిణి. ప్రతిరోజూ సృజనాత్మకతతో ఆలోచిస్తూ రకరకాల బొమ్మలు గీయడం, వినూత్నంగా తయారు చేయడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు సంపాదించుకుంటోంది. చిన్నతనంలోనే బొమ్మలు ఆమెకు జీవితంలోని మొదటి స్నేహితులుగా మారాయి. కార్టూన్ చానెల్స్ చూసి, ఆటలతో బొమ్మల ప్రపంచాన్ని తలపోస్తూ పెరిగింది దివ్య. అవి కేవలం ఆటలు కాదని, ఆమె ప్రతిభకు ఒక స్ఫూర్తి అనిపించింది.

బొమ్మలే కాదు భావాలు.. భావోద్వేగాలు

పెన్సిల్, కలర్ పెన్సిల్స్, కాఫీ పొడి చిత్రాలు, మండల్ ఆర్ట్, పేపర్ కటింగ్స్, వాటర్, గ్లాస్ పెయింటింగ్, కొబ్బరి చిప్పలు, తమలపాకులు, ఇలా విభిన్న విభాగాల్లోనూ తనదైన ప్రత్యేకతను దివ్య చాటుకుంటుంది. పెన్సిల్‌తో గీసిన బొమ్మలు సహజత్వంతో తారసపడతాయి. మండల్ ఆర్ట్‌లో సూక్ష్మత, క్రమబద్ధత మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. తన ఆలోచనల్ని, భావోద్వేగాల్ని కాగితం మీద ఇలా ప్రతిబింబించడమే కాదు, ఆమె కళను ప్రదర్శించే విధానంలో సరికొత్త సృజనాత్మకతను చూపిస్తోంది. ఆమెకు ఇష్టమైనవి కేవలం బొమ్మలు మాత్రమే కాదు, వాటి వెనుక ఉన్న భావాలు, కథలు, భావోద్వేగాలు కూడా..


కత్తిరింపుల్లో కొత్తదనం

కొబ్బరి చిప్పల్ని బొమ్మలు చేయడం, ఆకులపై చిత్రాలు వేయడం, సీసాలపై డిజైన్స్ వేయడం అబ్బురమనిపిస్తుంది. పేపర్ కటింగ్ విధానాన్ని పరిశీలిస్తే ఆ కాగితం కత్తిరింపుల్లోనే ఒక కొత్తదనం చూపిస్తూ చూపరుల్ని ముగ్ధుల్ని చేస్తోంది. దేవతామూర్తుల రూపాలు, యువతుల బొమ్మలు, హాస్య కార్టూన్లు, పౌరాణిక చిత్రాల నుంచి స్ఫూర్తితో గీసిన సృజనాత్మకత చిత్రాలు ఆమె చేతినుంచి అందంగా జాలువారాయి.



పరశురాముని స్పిల్ ఆర్ట్

సృజనాత్మకతతో ముందుకు..




సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నప్పటికీ, బొమ్మలు వేయడం నాకు సంతృప్తినిస్తోంది. జీవితంలో మనసుకు నచ్చేవి అనేకం ఉన్నాయి. వాటిని గుర్తించి, సృజనాత్మకతతో ముందుకు వెళ్లాలి. అందుకే సృజనాత్మకతకు ఒక ప్రత్యేక స్థానం ఇవ్వడమే నా జీవిత లక్ష్యం.

– కాసు దివ్యసాయిశ్రీ

సోషల్ స్టేటస్

తాను గీసిన చిత్రాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినప్పుడల్లా, వీక్షకులు వాటిని చూసి లైకులు, కామెంట్లు పెట్టి ప్రోత్సహిస్తున్నారు. ఒకసారి ప్రముఖ టాలీవుడ్ హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ దివ్య గీసిన ఒక బొమ్మను చూసి, 'ఇది నా రూపమే' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో కామెంట్ చేయడం, ఆ చిత్రాన్ని తన స్టేటస్‌లో పెట్టుకోవడంతో దివ్యకు పెద్ద గుర్తింపుగా మారింది. మరికొందరు తమిళ నటులు కూడా దివ్య టాలెంట్‌ను పలుమార్లు ప్రశంసించారు. ఈ ప్రశంసలు ఆమె కళాప్రయాణంలో మరింత ప్రోత్సాహమిస్తున్నాయి.



క్లుప్తంగా

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా హీరాలాల్ నియామకం



నరసరావుపేట: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కె.హీరాలాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం జిల్లా నీటి యాజమాన్య సంస్థలో ఫైనాన్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పథక సంచాలకులుగా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు పీడీగా వ్యవహరిస్తున్న బాలూనాయక్‌పై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే.

తెనాలి మార్గంలో పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గూడూరు-కృష్ణా కెనాల్ జంక్షన్ మధ్యలో మూడో లైన్ నిర్మాణ పనులు, తెనాలి యార్డ్ ఆధునికీకరణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు ప్యాసెంజర్ రైళ్లను 30 రోజుల పాటు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ-తెనాలి (67221), తెనాలి-రేపల్లె (67231), రేపల్లె-తెనాలి (67332) రైళ్లను ఈ నెల 12 నుంచి మార్చి 13 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

డాక్టర్ విజయకు అంతర్జాతీయ అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరు లలితా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అత్యంత ప్రతిష్టాత్మకమైన పాల్ డడ్లీ వైట్ ఇంటర్నేషనల్ స్కాలర్ అవార్డ్‌ను అందుకున్నారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ ఫిబ్రవరి 5 నుంచి 7 వ తేదీ వరకు లాస్ ఏంజెల్స్‌లో ఇంటర్నేషనల్ స్ట్రోక్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అంతర్జాతీయ సదస్సులో ఆహ్వానిత స్పీకర్‌గా హాజరైన ఆమె 'భారతదేశంలో స్ట్రోక్ సేవల పురోగతి, నాణ్యమైన చికిత్స, ఉత్తమ పద్ధతులు, కొత్త విధానాలు' అనే అంశంపై ప్రసంగించారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, అమెరికన్ స్ట్రోక్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సింపోజియంలో దేశంలో ప్రామాణిక స్ట్రోక్ సంరక్షణ విధానాలు ,అక్రెడిటేషన్ ప్రక్రియలు పక్షవాత పేషెంట్లకు ఎలా మెరుగైన ఫలితాలను సాధించగలవో వివరించారు. అంతర్జాతీయ సహకారంతో ఎక్యూట్ స్ట్రోక్ మేనేజ్ మెంట్‌పై డాక్టర్ విజయ పంపిన ఒరిజినల్ పరిశోధనా పత్రానికి 2025లో అత్యధిక స్థాయి ర్యాంకు గుర్తింపు పొంది ప్రతిష్టాత్మక పాల్ డడ్లీ వైట్ ఇంటర్నేషనల్ స్కాలర్ అవార్డ్‌ను అందుకున్నారు.

స్టేడియం.. ఆక్రమణల నిలయం

- నరసరావుపేట డీఎస్‌ఏ స్టేడియం ముందు యథేచ్ఛగా ఆక్రమణలు
- కనుమరుగైన స్టేడియం పార్కింగ్ స్థలం
- ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అద్దెలకు ఇచ్చుకుంటున్న టీడీపీ వర్గీయులు!
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



స్టేడియం ఎదురుగా రోడ్డు వరకు ఏర్పాటుచేసిన దుకాణాలు

నరసరావుపేట: కాదేది ఆక్రమణకు అనర్హం అన్నట్లుగా ఉంది జిల్లా కేంద్రం పరిస్థితి. గత ఎనిమిది నెలల కాలంలో టీడీపీ కార్యకర్తలు చిక్కిన చోట చిక్కినట్లుగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వాటిని అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీ కోడెల శివప్రసాదరావు క్రీడల స్టేడియం(డీఎస్‌ఏ) ముందుభాగాన్ని పూర్తిగా ఆక్రమణలకు గురైంది. డీమార్టుకు ఎదురుగా బంకులు ఏర్పాటుచేశారు. స్టేడియంకు ఎదురుగా రోడ్డు మార్జిన్‌గా ఉన్న సుమారు 20 అడుగుల స్థలాన్ని ఆక్రమించి కూరగాయలు, ఇతర దుకాణాలను ఏర్పాటు చేశారు. దీనిలో కొందరు ఏకంగా శాశ్వత నిర్మాణాలు చేశారు. స్టేడియం రెండోగేటును ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఏకంగా రెండంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు.

పార్కింగ్ స్థలం.. మాయం

గత ప్రభుత్వంలో స్టేడియం గోడను ఆనుకొని ఎవరూ దుకాణాలు ఏర్పాటుచేయకుండా నియంత్రించారు. వాటిని స్టేడియంలో నిర్వహించే కార్యక్రమాలకు వచ్చిన వారు, ప్రతిరోజూ ఉదయంపూట వాకింగ్‌కు వచ్చేవారు పార్కింగ్‌గా ఉపయోగించుకునేవారు. ప్రభుత్వం మారగానే ఆ స్థలాలు మాయమయ్యాయి. వాటి నిండా ఇప్పుడు దుకాణాలు పుట్టుకొచ్చాయి. కొంత మంది టీడీపీ నాయకులు ఈ స్థలాలను తమకింద ఆపుకొని అద్దెలకు ఇచ్చుకుంటున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. నిత్యం వందలాది వాహనాలు, ఆర్టీసీ, స్కూలు బస్సులు తిరిగే ప్రాంతమిది. ఈ మార్గంలోని బీసీ కాలనీ, సాయినగర్‌లో వందలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరందరూ నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సమీపంలోనే శ్రీ షిర్డీసాయిబాబా దేవాలయం ఉంది. ప్రతి గురువారం వేలాదిమంది భక్తులు ఈ దేవాలయానికి వచ్చివెళుతుంటారు. దీంతో పాటు స్టేడియంలో నిర్వహించే ఆటల పోటీలు, రాజకీయ నాయకులు సభలు, సాంస్కృతిక కార్యక్రమాలకు వచ్చే వారి వాహనాలను అన్నింటినీ పోలీసులు స్టేడియంలోకి అనుమతించరు. ఆయా వాహనాలు పార్కింగ్ చేసుకునే సౌకర్యం ఇటువంటి ఆక్రమణల వలన కోల్పోవాల్సివస్తుంది.

తూతూమంత్రంగా చర్యలు

ఒకవైపు పట్టణంలో ఆక్రమణలు తొలగిస్తున్నామంటూ హడావుడిచేసే మున్సిపల్ అధికారులకు ఈ ఆక్రమణలు ఎందుకు కన్పించటంలేదో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. గత నెలలో స్టేషన్ రోడ్డు, వినుకొండ రోడ్లలో ఆక్రమణలు తొలగించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. దీనిపై ముఖ్యనేత, ఇతర టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు కేవలం ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారివి, ఏ ఆధారంలేని వారివి మాత్రమే తొలగించి చేతులు దులుపుకొన్నారు. దీంతో ఆక్రమణలను గాలికి వదిలేశారనే విమర్శలు పట్టణ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ తనిఖీ

సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏపీ శాక్స్ జేడీ



బ్లడ్ బ్యాంక్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జాయింట్ డైరెక్టర్ ప్రసన్న

నరసరావుపేటటౌన్: ప్రభుత్వ వైద్యశాలలోని బ్లడ్ బ్యాంకును ఏపీ శాక్స్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న, అసిస్టెంట్ డైరెక్టర్ వి.బాబురావులు మంగళవారం తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంక్‌లోని సాంకేతిక సిబ్బందిని వివిధ అంశాలపై ప్రశ్నించారు. వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ ఉండగా వైద్యశాలలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆవశ్యకత ఏంటని ప్రశ్నించారు. ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల వారు నిర్వహించే క్యాంపులలో సేకరించే బ్లడ్ ప్యాకెట్లలో 30శాతం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుందని, ఆ విధంగా చేస్తున్నారా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్యశాలలోని వివిధ గ్రూపుల రక్తం లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.వి.రంగారావు, డాక్టర్ ఏడుకొండలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

గార్లపాటికి బంగారు నంది, అబ్దుల్ కలాం పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గార్లపాటి దాసు

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ తెలుగు కళారత్నాలు సాంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభవారు 2025 సంవత్సరానికి సంబంధించి జాతీయ బంగారు నంది, అబ్దుల్ కలాం పురస్కారాన్ని క్రోసూరుకు చెందిన ఏపీ ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి గౌరవ అధ్యక్షుడు గార్లపాటి దాసుకు మంగళవారం అందించారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ సీఈఓ డాక్టర్ యు.వి.రత్నం, డాక్టర్ ధనాసి ఉషారాణి, మద్దిశెట్టి సామేలు చేతుల మీదుగా బంగారు నంది, అబ్దుల్ కలాం పురస్కారంతోపాటు ప్రశంస పత్రాన్ని దాసు అందుకున్నారు. ఈసందర్భంగా దాసు సాక్షితో మాట్లాడుతూ ఈ పురస్కారంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. తనకు పురస్కారం అందించిన సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాటక రంగ నటుడు, డైరెక్టర్ శిఖా ఆదాం, బిషప్ ముక్తిపూడి సత్య కిరణ్, నన్నెపాగ ప్రశాంతి, సోపాటి ప్రభాకర్ రెడ్డి, రవణమ్మ వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కోసం మిర్చి రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి రైతులు మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువునా ముంచుతున్నారని నినాదాలు చేశారు. ఎకరా మిర్చి పంట సాగుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి, పండించిన మిర్చిని యార్డుకు తీసుకువస్తే ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. గత ఏడాది క్వింటా మిర్చికి రూ.20 వేలు నుంచి రూ.26 వేలు పలికిన ధరలు నేడు రూ.13 వేలు కూడా పలకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది తామర తెగులు, వాతావరణంలో మార్పుల కారణంగా 15 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితులు లేవన్నారు. ధరలు పతనం కాకుండా చూడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని అదనంగా బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇవే ధరలు కొనసాగితే మిర్చి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు అర్ధగంట పాటు రోడ్డుపై బైటాయించి, ఆందోళన చేశారు.

బీఓబీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్

చీరాల రూరల్: బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా చీరాలకు చెందిన దేవరకొండ ప్రవీణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 10వ తేదీన బ్యాంక్ ఆఫ్ బరోడా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో 15వ జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చినగంజాం మండలం చింతగుంపల్లె గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో పని చేస్తున్న చీరాలకు చెందిన ప్రవీణ్‌కుమార్‌ను ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫ్ బరోడా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అరకుకు చెందిన జీజేఎం ఎల్ కిషోర్ అసోసియేషన్ సెక్రటరీగా భారీ మెజారిటీతో ఎన్నికైనట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వైజాగ్‌కు చెందిన వైకే మధుసూదన్ హైదరాబాద్ జోన్ సెక్రటరీగా ఎన్నికై నట్లు చెప్పారు. మూడు కీలకమైన పదవులు ఏపీకి దక్కడంపై ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీలకు శివరామశేషయ్య ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన మాస్టర్ అథ్లెట్



కుర్రం శివరామ శేషయ్య

సత్తెనపల్లి: జాతీయస్థాయి పరుగు పందెం పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన మాస్టర్ అథ్లెటిక్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు కుర్రం శివరామశేషయ్య ఎంపికయ్యారు. మార్చి 4వ తేదీ నుంచి 7 వరకు బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఆయన ప్రాతినిధ్యం వహించనున్నారు. అనంతపురం జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ స్టేడియంలో ఈ నెల 7,8న జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో ఆయన ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు ఈ అథ్లెటిక్ మీట్‌కు హాజరు కాగా గుంటూరు జిల్లా నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కుర్రం శివరామశేషయ్య 60 సంవత్సరాల విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు మూడు విభాగాల్లో ప్రథమ స్థానం కై వసం చేసుకున్నాడు. 4 ఇంటు 100 మీటర్లు, 4 ఇంటు 400 మీటర్లు రిలే రెండు విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించి మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ వెటరన్ క్రీడాకారులు, తారకరామా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు మంగళవారం శివరామ శేషయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

తిరునాళ్ల ఏర్పాట్లలో అలసత్వం వద్దు

దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్



రామచంద్ర మోహన్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ చంద్రశేఖరరావు

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై అలసత్వం వహించవద్దని దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ తెలిపారు. కోటప్పకొండ ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం తిరునాళ్ల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. స్వామివారి దర్శన క్యూలైన్లు, పారిశుద్ధ్యం, తాగునీరు, ప్రసాదాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. తాగునీరు, పాలు, బిస్కెట్లు, మజ్జిగను సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్యూలైన్ల నిర్వహణలో వలంటీర్లు, స్కౌట్ సహకారాన్ని తీసుకోవాలన్నారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని మంచి అనుభూతితో తిరిగి వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ డి.చంద్రశేఖరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పది, ఇంటర్ పరీక్షల్లో సత్తా చాటాలి

- ఏపీ మోడల్ స్కూల్స్ జేడీ తాహెరా సుల్తానా
- పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష



మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ తాహెరా సుల్తానా

నాదెండ్ల: త్వరలో జరగబోయే పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు సత్తాచాటి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తాహెరా సుల్తానా చెప్పారు. పల్నాడు జిల్లా చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో పల్నాడు - బాపట్ల జిల్లాలకు సంబంధించిన ప్రిన్సిపాళ్లతో మంగళవారం అకడమిక్ రివ్యూ నిర్వహించారు. రెండు జిల్లాలకు సంబంధించి 15 మంది ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో నెలరోజుల్లో పరీక్షలు జరగనున్నందున ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థుల చదువుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు పౌష్టికాహారం ఇస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు తలెత్తే సమస్యలను నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని సూచించారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలలతో పాటూ రెండు జిల్లాలు పోటీపడేలా మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో చిరుమామిళ్ల ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణం



లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నరసరావుపేట రూరల్: రావిపాడు గ్రామంలోని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి, అంకమ్మ తల్లి ఆలయ 16వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. సాయంత్రం లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాద వితరణ గావించారు. కొత్త వెంకటేశ్వర్లు, పార్వతి, శ్రీ వాసవి మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, వెంకట సూర్యకుమారి, పాలిశెట్టి సతీష్ పాల్గొన్నారు.

భక్తజన పుణ్యక్షేత్రం

- ముగిసిన మేరీమాత ఉత్సవాలు
- తిరునాళ్లకు లక్షలాదిగా వచ్చిన భక్తులు
- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న విదేశీయులు



గుణదల మేరీమాత పుణ్యక్షేత్రానికి పోటెత్తిన భక్తులు

గుణదల(విజయవాడ తూర్పు): ప్రసిద్ధ గుణదల పుణ్యక్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగిన మేరీమాత ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ఆఖరి రోజు కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. దేశంలోని అనేక ప్రాంతాలతో పాటు దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వచ్చారు. వారంతా సభక్తి పూర్వకంగా మరియతల్లిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. బిషప్‌గ్రాసి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆలయ గురువులు సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు.

దేవునిపై విశ్వాసం ఉంచాలి

విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. దేవునిపై విశ్వాసం కలిగి జీవించిన భక్తులకు సకల ఆశీర్వాదాలు లభిస్తాయన్నారు. క్రైస్తవ విశ్వాసులు మారు మనసు పొంది, హృదయ పరివర్తనతో జీవించాలని సూచించారు. తోటి వారితో సోదరభావంతో నడుచుకోవాలన్నారు. దేవుడు పవిత్ర బైబిల్ గ్రంథంలో చెప్పిన విధంగా ప్రేమ, జాలి, దయ, కరుణ వంటి లక్షణాలను జీవితాల్లోకి అన్వయించుకోవాలన్నారు. గుణదల కొండపై కొలువు దీరిన మరియమాత భక్తుల కోర్కెలు తీర్చేందుకు దేవుడిని ప్రార్థిస్తుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది భక్తుల నీరాజనాలు అందుకుంటూ మరియతల్లి కొలువుదీరిన గుణదల ఆధ్యాత్మిక శిఖరంగా నిలుస్తోందన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇటాలియన్ విశ్రాంత బిషప్ సీజర్ బొనవెంచర్, గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, పలువురు విచారణ గురువులు పాల్గొన్నారు.

తరలివచ్చిన విదేశీయులు

మూడు రోజులు కొనసాగిన గుణదల ఉత్సవాలకు భక్తులు లక్షలాదిగా తరలి వచ్చారు. ముగింపు వేడుకల్లో భాగంగా ఆస్ట్రియా దేశం నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సమష్టి దివ్యబలి పూజలో పాల్గొని సత్ప్రసాదం స్వీకరించారు. కొండపై కొలువైన మరియమాతను దర్శించుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందింపజేసే విధంగా ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దావీదు విజయం, సంసోను డెలీ వంటి నాటికలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. దివ్యబలి పూజ సమయంలో మదిరి బెర్నార్డ్ ఆధ్వర్యంలో మైత్రాసన గాయకబృందం ఆలాపించిన భక్తి గీతాలు భక్తులలో ఆధ్యాత్మికతను నింపాయి.



చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులు అరెస్ట్

రూ.16 లక్షల విలువైన బంగారం, ఇతర సామగ్రి స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ



రికవరీ చేసిన బంగారం, నగదు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో నెల వ్యవధిలో జరిగిన రెండు చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం వారిని కోర్టుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ... ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్సైలు, ఎస్‌బీ తదితర సిబ్బంది కలిసి పనిచేసి నిందితులను అరెస్ట్ చేశారని చెప్పారు. ఉండవల్లి సెంటర్‌లో ఉపాధ్యాయురాలు శిల్ప ఇంట్లో, బ్యాంకులో పనిచేస్తున్న మల్లికార్జునరావు ఇంట్లో చోరీలు జరిగినట్లు గుర్తుచేశారు. పోలీసుల దర్యాప్తులో కేఎల్ రావు కాలనీకి చెందిన చల్లా నాగరాజును నిందితుడిగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. విచారించగా బోరా దుర్గారెడ్డితో కలిసి ఈ చోరీలకు అతడు పాల్పడ్డట్లు తెలిసిందన్నారు. రూ.16 లక్షల విలువైన బంగారు, కొంత నగదు, ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నాగరాజు చెడు వ్యసనాలకు అలవాటు పడి చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. బంగారం కరిగించి విక్రయించగా వచ్చిన సొమ్ముతో యాప్‌లలో బెట్టింగ్‌లు కాసి పోగొట్టుకున్నాడని పేర్కొన్నారు. చల్లా నాగరాజు విజయవాడలో కూడా చోరీకి పాల్పడినట్లు తెలియవచ్చిందని చెప్పారు. వీరిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

గంజాయిపై సమాచారమివ్వాలి

మంగళగిరి సబ్ డివిజన్‌లో ఎక్కడైనా గంజాయి అమ్మకాలు జరిగినా, సేవిస్తున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే పలుమార్లు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేశామని గుర్తుచేశారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసుల్లో 15 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు. మందుబాబులు బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాల్లో రోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.